6

# ఓటరు శరణం గచ్ఛామి

శుద్ధోదన్‌రావు మంత్రిగా "రాజ్యమేలు" తున్న రోజులవి. అవసరాన్నిబట్టి ధర్మం రెండు చక్రాలమీద, నాలుగు చక్రాలమీద.... మరీ మాట్లాడితే ఇంకా ఎక్కువ చక్రాలమీద పరుగెత్తే రోజులవి.

ఆయనకు ఆరోజు మనసులో మనసులేదు. తన నోముల పంట. కలల ఫలితం అయిన సిద్ధార్థ విదేశం నుండి తిరిగొస్తున్నాడు. ఎంతో జ్ఞానసంపద తెస్తున్నాడు. సిద్ధార్థ ప్రధాన మంత్రై రాజ్యమేలాలని, అన్ని దేశాలతో సత్సంబంధాలు పెంచుకుని అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాలని ఆయన కోర్కె.

సిద్ధార్థ పుట్టకముందు ఆయన భార్య శ్రీమతి మాయా శుద్ధోధన కలలో తెల్లధనం కనిపించింది. ప్రముఖ జ్యోతిష్య పండితులను పిలిపించి ఫలితం అడిగాడు. "అబ్బాయి జాతకం గొప్పగా వుంది. బతికితే అమెరికా ప్రెసిడెంటులా బతుకుతూ, వ్యవహారదక్షతతో జనాన్ని అణచిపెట్టగలడు. లేదా ప్రభుత్వంపై తిరగబడి విప్లవవీరుడు కాగలడు" అని చెప్పారు. వాళ్ళ జ్యోతిష్యం మంత్రిగారికి నచ్చలేదు. వెంటనే ఆయన మిత్రుడైన ప్రొఫెసర్ కౌండిన్యను సంప్రదించాడు. ప్రొఫెసర్ కౌండిన్య మహామేధావి. ఇలాంటివి అవలీలగా తేల్చి చెప్పగలడు.

"మీవాడికి రాజరికపు లక్షణాలు లేవండి. అన్నీ త్యజించి, సామాన్యుల్లో కలుస్తాడేమోనని నా అనుమానం," అని బొలబొలా నవ్వాడు- కౌండిన్య.

"ఛీ-ఛీ తన కొడుకేమిటి? ఆకలితో, బీదతనంతో సామాన్యుడిలా బతకడమేమిటి?"- అని రావుగారు లోలోన నవ్వుకున్నారు. ఈ పాడుదేశంలో వుంటే పిల్లవాడు చెడిపోతాడని చిన్నతనం నుండి విదేశాల్లో పెంచాడు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో చదివించాడు. టెక్సాస్‌లో, విస్కాన్‌సిన్‌లో.... అబ్బాయికి ఇష్టమైన చోట్లలో వుండనిచ్చాడు. చదువు అయిపోయిన తర్వాత స్వదేశానికి రప్పించి, సత్సంప్రదాయంగల కుటుంబీకుల పిల్లతో పెళ్ళిచేసి వారిని ఇంగ్లండు పంపించాడు. అక్కడ క్లబ్బులలో సిద్ధార్థ జీవితం మత్తుగా గమ్మత్తుగా నగ్ననృత్యం చేసింది. ఉబుసుపోక చిన్నకార్లు తయారు చేయడం విమానాలు నడపడం నేర్చుకున్నాడు. బోట్స్ క్లబ్బులో రైఫిల్ క్లబ్బులో అనేక బహుమతులు గెల్చుకున్నాడు. సిద్ధార్థ - ఇప్పుడు మళ్ళీ స్వదేశానికి వస్తున్నాడు.

ఎయిర్‌పోర్టు నుండి ఇంటిదాకా వున్న తోరణాల్ని సుస్వాగతం- ద్వారాల్ని, రోడ్లకు ఇరువైపులా వున్న లక్షలాది జనాన్ని దాటి భవిష్యత్ దేశనాయకుడు సతీసమేతంగా ఇల్లు చేరాడు. పేదలు పేదల సంఘాలగురించి, వాస్తవికత గల సాహిత్యం గురించి, సినిమా గురించి, పేదోళ్ళపాటలు-పత్రికల గురించి ఏదీ తెలియకుండా కట్టుదిట్టం చేశాడు శుద్ధోధనరావు. దేశం సుభిక్షంగా వుందని ఢంకా భజాయించి చెప్పే రేడియో, టెలివిజన్, ప్రభుత్వ పత్రికలు, కమర్షియల్ సినిమాలు మాత్రమే అందుబాటులో వుండేట్టు చేశాడు. ఒక పి.ఎ.ను కూడా ఏర్పాటుచేశాడు. కాని వాటితో సిద్ధార్థ ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది.

టెలివిజన్‌లో కోళ్ళపెంపకం, పాడిపరిశ్రమ చూసి, చూసి, విపరీతమైన తలనొప్పి వచ్చేది. దృష్టిలోపం కలిగి, కళ్ళజోడు వేసుకోవాల్సి వచ్చింది. కమర్షియల్ సినిమాల్లో అర్ధనగ్నంగా వుండే హీరోయిన్లను, ముడతలు కనబడకుండా బాత్‌రూం సీన్లో సైతం

ఫుల్‌సూట్‌లో వుండే ముసలి హీరోలను చూసి థియేటర్‌లో చాలా సార్లు వాంతిచేసుకున్నాడు. పాడడమంటే అరవడమేననుకునే అమా యక నేపథ్యగాయకుల గొంతులు వినీ వినీ చెముడొచ్చింది. ఉన్న పళాన బి. పి. పెరుగుతూ వుండేది.

"అదేమిటి చెన్నేష్? ఆ హీరో ఆ అమ్మాయిని అన్నిసార్లు రేప్‌చేస్తున్నాడు?" అని అడిగాడు పక్కనే వున్న పి. ఎ. ను ఒక సారి. చెన్నేష్ అర్థవంతంగా నవ్వి" అది రేప్‌కాదు సార్. కేవలం డ్యూయేట్ పాడుతూ........ డాన్సు. సర్వఖండ విఖ్యాత - ఆముదా లచ్చన్ ప్రత్యేకత అదేసార్.

"అయితే ఖర్మగాలి నామిసెస్ - యశోధర సినీనటి అయితే ఆవిడగతీ ఇంతేనా?'' వాపోయ్యాడు సిద్ధార. చెన్నేష్ ముఖం గంభీ రమై పోయింది. సినిమాల్లో సైడ్‌హీరో ముఖంలా ఏమనాలో తెలి యక.

"అవునూ ఈ ఆముదా లచ్చన్ ఎవరూ?''- అని సిద్ధార్థ ప్రశ్నించేసరికి జవాబు వచ్చిన స్కూలు కుర్రాడి ముఖంలా, ముఖ మంతా కళకళలాడించుకుని జవాబు చెప్పాడు చెన్నేష్.'' సార్ అతని పేరు మొదట లచ్చయ్యండి సినిమాలో చేరిన తరు వాత స్టయిలిష్‌గా వుండాలని అలా మార్చుకున్నాడు. వంద సిని మాల్లో నటించి సర్వఖండాలలో ప్రఖ్యాతుడయ్యాడట-

ఆ తర్వాత సిద్ధార నగరంలో ఒకరోజు పాలకోసం, కిరోసిన్ కోసం సామాన్యుల క్యూలు, మరొకరోజు డిమాండ్లకోసం ఉద్యో గుల నిరాహారదీక్షలు, ఊరేగింపులు ఇంకో రోజు విద్యార్థులపైన బాష్పవాయువు, గుడ్డివాళ్ళమీద లాఠీఛార్జి చూశాడు. వివరాలు తెలుసుకున్నాడు.

సిద్ధార్థలో క్రమంగా మార్పు వచ్చింది. ఎక్కువసేపు నిశ్శ బ్దంగా వుండేవాడు. ఏవేవో పుస్తకాలు చదివేవాడు తీవ్రంగా ఆలో

చించేవాడు. కొడుకు ప్రవర్తన శుద్ధోధనరావుకు చక్కిలిగింతలు పెట్టినంత నవ్వు పుట్టించేది. జనజీవిత సమస్యలగూర్చి ఆలోచన రాకుండా సిద్ధార్థను క్రికెట్ స్టేడియంకు, పేకాట క్లబ్బులకు, మల్టీ స్టార్ షూటింగులకు, ప్రభుత్వ కవి సమ్మేళనాలకు, స్వాతంత్ర్య దినోత్సవాలకు దేశవిదేశనాయకుల మీటింగులకు పంపించేవాడు. కాని సిద్ధార్థ ఆ కుట్ర గ్రహించి ఎప్పటి కప్పుడు జాగ్రత్త పడుతుండే వాడు.

ఒకరోజు సిద్ధార్థ మనసు పిచ్చిగా వుండగా పి.ఎ. చెన్నేష్‌కు చెప్పాడు. అతడు డ్రైవర్ని కూడా వద్దని సాయంత్రపు చల్లగాలిలో సిద్ధార్థను తిప్పుకొద్దామని టొయోటా కారు తెచ్చాడు. కారులో సన్నగా వెస్టరన్ మ్యూజిక్ అడుగున ఆడ, మగ గొంతుల ఉచ్ఛ్వాసనిశ్వాసాలు బరువు, బరువుగా కసికసిగా లేచి పడుతున్నాయి. సిద్ధార్థ నరాలు బిగుసుకున్నాయి. ఓ రెండు పెగ్గులవైన్ కావాలనిపించింది. కాని ఆకోర్కె ఎక్కువసేపు నిలువలేదు.

నగరం దాటాక, చాలాదూరం డ్రైవ్ చేశాడు- చెన్నేష్. అక్కడొక మారుమూల గ్రామంలో వందల సంఖ్యలో గ్రామస్తులు కనిపించారు. అకస్మాత్తుగా అంతమంది కనిపించేసరికి సిద్ధార్థ ఆశ్చర్య పోయాడు.

"చెన్నా! కారు ఆపు"- అన్నాడు, చెన్నేష్ కారాపాడు.

బడి ఆవరణలో గ్రామస్తులంతా కూర్చుని, ప్రజాసాంస్కృతిక ప్రదర్శనలు చూస్తున్నారు. సిద్ధార్థ కూడా ప్రదర్శనలు అయిపోయే వరకు కారులో కూర్చుని ఓపికగా చూశాడు.

చెన్నేష్‌కు భయంవేసింది. నోటమాటరాలేదు. ఆ ప్రదర్శనలో దేశంలోని ఆకలి దారిద్ర్యం, కరువు, వరదలు, అధికారుల నిర్లక్ష్యం, దేశనాయకుల మోసాలు, అన్నీవున్నాయి. శుద్ధోధనరావుగారు తన

నింకా ఉద్యోగంలో ఉంచుకుంటారో లేదో నన్న భయంతో గజగజ వణికి పొయ్యాడు- చెన్నేష్.

గ్రామాల్లో తిరుగుతూ జనాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దు తున్న కార్యకర్తలతో సిద్ధార్థ చాలాసేపు మాట్లాడాడు. వాళ్ళు కొన్ని కరపత్రాలు, పత్రికలూ ఇచ్చారు. అవి తన తండ్రితో సహా అందరి దేశనాయకుల కుతంత్రాల్ని బహిరంగ పరిచాయి.... విద్యార్థుల నిర్బంధాలు, గుడిసెలపై బుల్‌డోజర్లు, గిరిజనులపై కాల్పులు, కవులపై కళాకారులపై ఆంక్షలు, బనాయించిన కుట్రకేసులు మొద లైన వాటి వివరాలన్నీ తెలిపాయి.

సిద్ధార్థముఖం ఎర్రబడింది. ఆవేశం కట్టలు తెంచుకుంది. కర్తవ్యం స్పష్టమైంది. గ్రామస్తులు చుట్టుముట్టారు, ఆదరించారు. సహజమైన వాళ్ళమాటతీరు, ఆప్యాయతతో అతనివళ్ళు పులకించింది. రైతుకూలీల భయంకర పరిస్థితి తెలిసింది.

ఆ మరుసటిరోజు నుండి జనంతో గడపడమే ఆయన దిన చర్యలో ప్రధానభాగమైంది. తండ్రి ఆస్తి విశ్వరూపం చూపింది. మగువలు, మత్తుపానీయాలు దోబూచులాడినయి. భార్య శ్రీమతి యశోధరతో దేశ విదేశాల్లో గడిపిన మధురజీవితం ఆహ్వానించింది. ఈమధ్యనే కాన్వెంటులోచేరిన రాహుల్ ఇంగ్లీషు మాటలు ముందర కాళ్ళ బంధ మయ్యాయి. కానీ, కానీ........లాభంలేకపోయింది.

వ్యవస్థ వికృత రూపానికి లెక్కలేనన్ని అన్యాయపు చేతులు మొలుస్తుండడం సిద్ధార్థ సహించలేక పోయాడు. ఒకనాటి అర్ధరాత్రి ఇల్లువిడిచి అడవుల్లోకి వెళ్ళిపొయ్యాడు. ముక్తికోసం కాదు పీడిత జనవిముక్తి కోసం! సన్యసించడానికి కాదు సంఘర్షించడానికి!!

శుద్ధోధనరావు ఏమాత్రం గాబరాపడలేదు. తనకొడుకును ఎలా రప్పించుకోవాలో తెప్పించుకోవాలో తనకు తెలుసునని అంద

రితో చెప్పాడు. సిద్ధార్థ తిరిగివచ్చి తమపార్టీ భారత్‌దేశ్ (ఎ)కు అధ్యక్షుడవుతాడని. ఓట్లడుక్కుంటూ దేశం నలుమూలలా తిరుగుతాడని ఆయన తన ప్రగాఢ విశ్వాసాన్ని పత్రికాగోష్ఠిలో వెల్లడించారు. ○

మయూరి వారపత్రిక
13 జూన్ 1986